

## నగరజీవికి ట్రా'ఫికర్'

హైదరాబాద్ నగర ప్రజలకు ట్రాఫిక్‌జామ్ నిత్యం నరకం చూపిస్తున్నది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నగరజీవిని ట్రాఫిక్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లాలన్నా గంటల తరబడి ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకోవాల్సి వస్తున్నది. బంపర్ టు బంపర్ వాహనాన్ని నడపాల్సి ఉంటున్నది. సాయంత్రం చలివేళల్లో చిన్నపిల్లలతో ద్విచక్ర వాహనంపై అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే జ్వరం, సర్ది బారిన పడాల్సి వస్తున్నది. బీఆర్ అంబేద్కర్ సచివాలయం సమీపంలో శనివారం రాత్రి ఈ చిత్రం కనిపించింది.

# గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లకు 5 లక్షల ప్రమాద బీమా

- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల ఉచిత వైద్యం
- క్యాబ్ డ్రైవర్ల కోసం టీహబ్ ద్వారా ప్రత్యేక యాప్ రూపొందిస్తాం
- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో/అబిడ్స్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ బాయ్స్, ఆటో డ్రైవర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని గాంధీ దర్శన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో సీఎం గిగ్ వర్కర్ల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.



శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని గాంధీ దర్శన్ హాల్‌లో నిర్వహించిన గిగ్ వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సామాజిక రక్షణ కల్పించటంలో తమ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని వెల్లడించారు. అసంఘటిత కార్మికుల ఉపాధి, సామాజిక భద్రతకు విధాన నిర్ణయం తీసుకుంటామని వివరించారు. రాజస్థాన్‌లో చేపట్టిన చట్టాన్ని అధ్యయనం చేసి, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. గివ్ అండ్ టేక్ పాలసీని పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాలుగు నెలల క్రితం కుక్క తరిమితే భవనం పై నుంచి పడి మృతి చెందిన స్విగ్గీ బాయ్ కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు అందించాలని అధికారులను ఆదేశిస్తున్నానని తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నామని, అక్కడ దరఖాస్తుల్లో వివరాలు అందించాలని క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ బాయ్స్, ఆటో డ్రైవర్లకు సూచించారు. సమావేశానంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నట్టు అంచనా వేస్తున్నామని, వారిని కనీస వేతనాల పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఆటో కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు కూడా తెలంగాణ బిడ్డలేనని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఏఐసీసీ సెక్రటరీలు రోహిత్ చౌదరి, మన్సూర్ అలీఖాన్, మధు యాష్కీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు చేదు అనుభవం

మొదటిపేజీ తరువాయి...

సమావేశం జరిగే నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు వెళ్లారు. అయితే, ఆ సమావేశం ఆటో డ్రైవర్లది కాదని, గిగి వర్కర్స్‌ది అని చెప్పడంతో వారంతా నిరుత్సాహానికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ కావాలనే తమ బతుకులతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిగ్ ఆధ్వర్యంలో ఓలా, ఉబర్, స్విగ్గీ, జొమాటో తదితర అసంఘటిత కార్మికుల సమస్యలపై సీఎం చర్చించినా, ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోతున్న తమతో సమావేశం ఏర్పాటు చేయకపోవటంపై ఆటోడ్రైవర్ హబీబ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాగూ వచ్చామని, సీఎంను కలిసి తమ సమస్యలను చెప్తామని అడిగినా పోలీసులు వారిని అనుమతించలేదు. బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. లోపలికి



ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద సీఎం రేవంత్‌ను కలిసేందుకు వచ్చిన ఆటోడ్రైవర్లను అడ్డుకున్న పోలీసులు

వెళ్లనివ్వాలని పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఆటోడ్రైవర్లు.. సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేయకపోతే పెద్దఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ బాబు వారి వద్దకు వచ్చి ఆటోడ్రైవర్ల సమావేశం కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

### మీడియాపై పోలీసుల ఓవరాక్షన్

గిగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం ఉందంటూ మీడియాకు ఆహ్వానం ఉన్నప్పటికీ జర్నలిస్టులను పోలీసులు లోపలికి అనుమతించలేదు. అలాంటప్పుడు తమను ఎందుకు పిలిచారని నిర్వాహకులను జర్నలిస్టులు ప్రశ్నించగా, వారు సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. అక్కడే ఉన్న కొంతమంది ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు లైవ్ ఇవ్వడం కోసం ప్రయత్నించగా, వారిని పోలీసులు బారికేట్ల వరకు నెట్టుకొచ్చి బయటకు పంపించారు. తమకు ఆదేశాలు ఇలాగే ఉన్నాయని నోరు పారేసుకున్నారు. సీఎం సమావేశ కవరేజీ కోసం వస్తే లోపలికి అనుమతించకుండా అవమానించారని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి జర్నలిస్టులంటే లెక్కలేదని మండిపడ్డారు.





అలంపూర్ ఎమ్మెల్యే విజయుడి ఫొటో, పేరు లేకుండా సంపత్‌కుమార్ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ

# ప్రొటోకాల్ జాన్తానై

- క్రిస్మస్ వేడుకల్లో ఇష్టారాజ్యం
- జనగామలో ఎమ్మెల్యే పల్లాను కాదని ఓడిన అభ్యర్థితో కానుకల పంపిణీ
- కలెక్టర్‌కు ఎమ్మెల్యే పల్లా ఫిర్యాదు
- అలంపూర్‌లోనూ ఎమ్మెల్యే విజయుడికి అవమానం

జనగామ/అలంపూర్/ జడ్చర్ల టౌన్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రభు త్వం అధికారికంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్‌ను పాతరేస్తున్నారు. చాలాచోట్ల బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా, అధికారంలేని కాంగ్రెస్ నేతలతో పంపిణీ చేయిస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కాదని ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం క్రైస్తవులకు కానుకల పంపణీ చేశారు. అధికారుల నిబంధనల ఉల్లంఘనపై కలెక్టర్ శివలింగయ్యకు ఎమ్మెల్యే రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. పేదలకు పం చాల్సిన 950 క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లను అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు పంచుకున్నారని ఆరోపించారు. ప్రొటోకాల్ ఇవ్వని అధికారులపై అసెంబ్లీ స్పీకర్, చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

### అలంపూర్‌లో ఎమ్మెల్యే విజయుడి విస్మరణ

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో క్రిస్మస్ కానుకల పంపిణీ ఆద్యంతం కాంగ్రెస్ కార్యక్రమంగా కొనసాగింది. వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే విజయుడు ఫొటో, పేరు పెట్టలేదు. కార్యక్రమానికి సైతం ఆయనను ఆహ్వానించలేదు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఫొటో, పేరు మాత్రం ఉన్నది. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ అంశంపై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని బేతని ఎంబీ చర్చిలో నిర్వహించిన కార్యక్రమ వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో 'తెలంగాణ (కాంగ్రెస్) ప్రభుత్వం వారిచే' అని పేర్కొనటం చర్చనీయాంశంగా మారింది.





జడ్చర్లలో క్రిస్మస్ కానుకల పంపిణీ వేదికపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమని ఉన్న బ్యానర్

# 98% సర్కారు బకాయిలే

మొదటిపేజీ తరువాయి...

విద్యుత్తు రంగమే దివాలా తీయడానికి, అప్పుల పాలు కావడానికి ఈ మూడు ప్రాంతాల నుంచి బిల్లులు చెల్లించకపోవడమే కారణం. బకాయి బిల్లులు చెల్లిస్తామని ఈ ముగ్గురు నేతలు ఎందుకు ముందుకు రాలేదు?'.. డిసెంబర్ 21 నాడు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలివి. ఈ విమర్శలపై 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయిలో పరిశీలించగా విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయి. సిద్దిపేట సర్కిల్ (జిల్లా) మొత్తంపై ఉన్న విద్యుత్తు బకాయిల్లో సుమారు 97.8 శాతం నీటిపారుదల, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించినవే ఉన్నట్టు తేలింది. గృహ వినియోగదారుల బకాయిలు రూ.7.03 కోట్లే. అంటే మొత్తం బకాయిల్లో కేవలం 0.35 శాతమన్నమాట.

**విద్యుత్తు బకాయిలు (రూ.కోట్లలో)**

| క్యాటగిరీ | సిద్దిపేట డివిజన్ | గజ్వేల్ డివిజన్ | హుస్నాబాద్ డివిజన్ | సిద్దిపేట సర్కిల్ మొత్తం |
|---|---|---|---|---|
| డొమెస్టిక్ క్యాటగిరీ-1 | 2.52 | 3.68 | 0.83 | 7.03 |
| కమర్షియల్ క్యాటగిరీ-2 (షాప్స్) | 1.62 | 2.73 | 1.03 | 5.38 |
| ఇండస్ట్రియల్ క్యాటగిరీ-3 | 0.20 | 0.07 | 0.23 | 0.50 |
| కాటేజ్ ఇండస్ట్రీస్ క్యాటగిరీ-4 | 0.21 | 0.03 | 0.68 | 0.92 |
| అగ్రికల్చర్ క్యాటగిరీ-5 | 5.80 | 6.99 | 3.08 | 15.87 |
| స్ట్రీట్ లైట్స్, పీడబ్ల్యూఎస్ (క్యాటగిరీ-6ఏ, 6బీ) | 4.23 | 4.56 | 6.49 | 15.28 |
| జనరల్ క్యాటగిరీ-7 (స్కూల్స్, టెంపుల్స్) | 0.31 | 0.76 | 0.23 | 1.30 |
| హెచ్‌టీ గవర్నమెంట్ సర్వీసెస్ | 476 | 419 | 24 | 919 |
| హెచ్‌టీ ఇరిగేషన్ | 493 | 507 | 18 | 1,019 |
| మొత్తం | 984.06 | 945.50 | 54.75 | 1,984.31 |

### ప్రభుత్వ బకాయిలే అధికం

సిద్దిపేట సర్కిల్ (జిల్లా) పరిధిలో విద్యుత్తు బకాయిల మొత్తం రూ.1,984.31 కోట్లు ఉన్నాయి. ఇందులో హెచ్‌టీ ఇరిగేషన్ (నీటిపారుదల), హెచ్‌టీ గవర్నమెంట్ సర్వీసెస్ (ప్రభుత్వ కార్యాలయాలు)లకు సంబంధించిన బకాయిలే రూ.1,938 కోట్ల వరకు ఉండటం గమనార్హం. అంటే మొత్తం బకాయిల్లో ఈ రెండు క్యాటగిరీల బకాయిలు కలిపి 97.7 శాతం ఉన్నాయి. పాఠశాలలు, దేవాలయాలకు సంబంధించిన బకాయిలు రూ.1.30 కోట్లు, వీధి దీపాలు, పీడబ్ల్యూఎస్ లాంటివాటి బకాయిలు రూ.15.28 కోట్లు ఉండగా, వ్యవసాయానికి సంబంధించిన బకాయిలు రూ.15.87 కోట్లు ఉన్నాయి. గృహ వినియోగదారుల నుంచి రావాల్సింది రూ.7.03 కోట్లు మాత్రమే. మొత్తం బకాయిల్లో ఇవి 0.35 శాతం. రూ.13.83 కోట్లు మాత్రమే వ్యక్తిగత వినియోగదారులకు సంబంధించినవి. మిగతా మొత్తం ప్రభుత్వమే చెల్లించాల్సి ఉన్నది.

### ప్రజలను అనుమానించేలా ప్రకటనలు

నిజానికి సిద్దిపేట జిల్లాలో నీటిపారుదలకు సంబంధించిన రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి రిజర్వాయర్లు, వాటికి అనుసంధానంగా లిఫ్టులు భారీగా ఉన్నాయి. అందుకే నీటిపారుదల శాఖ బకాయిలు రూ.1,019 కోట్లు ఉన్నాయి. ఇక ప్రభుత్వ సర్వీసుల్లో కలెక్టరేట్, సీపీ కార్యాలయం.. ఇలా మొత్తం ప్రభుత్వ కార్యాలయాల మొత్తం బకాయిలు రూ.919 కోట్లు ఉన్నాయి. ఇలా 97.7 శాతం ప్రభుత్వ బకాయిలే ఉన్నప్పుడు స్థానిక ఎమ్మెల్యేలను బాధ్యులను చేసి బకాయిలు చెల్లించేలా చూడాలని సీఎం అంటున్నారు. అంటే ఆయా ఎమ్మెల్యేలు బకాయిల కోసం సీఎంను నిలదీయాలా? ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై బురదజల్లేందుకే ఇలాంటి విమర్శలు చేస్తున్నదని, సీఎం చెప్పినదాంటో ఒక్కటంటే ఒక్కటి కూడా నిజం లేదని విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. పైగా బిల్లులు కట్టడంలేదని సిద్దిపేట, గజ్వేల్ ప్రజలను సీఎం అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

# జ్ఞాపకశక్తికి పసుపు

- గుండె ఆరోగ్యానికి దివ్యౌషధం
- కల్తీ పసుపుతో అనేక వ్యాధులు
- కర్కుమిన్‌తో నాణ్యత గుర్తింపు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): దెబ్బ తగిలినా, కత్తి కోసుకుపోయినా వెంటనే ప్రథమ చికిత్సగా గుర్తొచ్చేది పసుపు. ఇది గొప్ప యాంటి సెప్టిక్‌గా పనిచేస్తుంది. కరోనా సమయంలో పసుపు చేసిన మేలుకు ప్రపంచం ఫిదా అయ్యింది. అయితే, యాంటి సెప్టిక్‌గానే కాదు.. జ్ఞాపకశక్తి పెంచటంలోనూ పసుపు మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెప్తున్నారు. అభిజ్ఞా శక్తిని పెంపొందించటంలో ఇది సాయపడుతుందని అంటున్నారు. మార్కెట్‌లో దొరికే కొన్ని రకాల బ్రాండ్ల పసుపు కల్తీ ఉంటున్నదని, దాన్ని గుర్తించకపోతే దీర్ఘకాలంలో అనేక రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. పసుపులో ఉండే కర్కుమిన్‌తో దాని నాణ్యతను పరీక్షించవచ్చని వివరించారు.

**పసుపుతో ఆరోగ్య ప్రయోజనాలు:**

- కాగ్నిటివ్ హెల్త్‌ని పెంపొందించడం, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు తోడ్పడుతుంది.
- కర్కుమిన్ యాంటి ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.
- ఆక్సిడేషన్ ఒత్తిడిని తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యానికి దోహదపడుతుంది.
- నొప్పి నివారణలో కీలక పాత్ర పోషిస్తుంది.
- కీళ్లు చురుకుగా కదలడంలోనూ ముఖ్య పాత్ర.
- జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి, జీర్ణ ప్రక్రియను మరింత మెరుగుపరుస్తుంది.
- కొబ్బరి నీళ్లు లేదా నెయ్యిలోనూ అర స్పూను పసుపు కలుపుకొని పరగడుపున తాగితే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.





# నేడు బీఆర్‌ఎస్ 'స్వేదపత్రం'

మొదటిపేజీ తరువాయి...

అధ్యాయం. పగలూ రాత్రి తేడా లేకుండా రెక్కల కష్టంతో చెమటోడ్చి నిర్మించిన తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీస్తే సహించం. విఫల రాష్ట్రంగా చూపించాలని ప్రయత్నిస్తే భరించం. అగ్రగామి రాష్ట్రాన్ని అవమానిస్తే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకోం. అందుకే గణాంకాలతో సహా వాస్తవ తెలంగాణ ముఖచిత్రాన్ని వివరించేందుకు.. అప్పులు కాదు.. తెలంగాణ రాష్ట్రానికి సృష్టించిన సంపదను ఆవిష్కరించేందుకు తెలంగాణ భవన్ వేదికగా స్వేదపత్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయబోతున్నామని శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించిన విషయం తెలిసిందే. శనివారం వల్ల వాయిదాపడిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# కొత్తగా 12 మందికి కరోనా

- రాష్ట్రంలో పెరుగుతున్న కేసులు
- ప్రస్తుతం 38 యాక్టివ్ కేసులు
- రోజుకు 4 వేల టెస్టులు చేయండి
- మంత్రి రాజనర్సింహా ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 12 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు అధికారులు తెలిపారు. ఇందులో 9 కేసులు హైదరాబాద్‌లో నమోదు కాగా, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఒక్కో కేసు వెలుగుచూసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 38 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఒకరు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షల సంఖ్యను రోజుకు 4 వేలకు పెంచాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశించారు. శనివారం సచివాలయంలో వైద్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన ఆయన.. రాష్ట్రంలో కొవిడ్ పరిస్థితులు, వ్యాప్తి, ముందస్తు చర్యలు, ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్ల పరిస్థితి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల వినియోగాన్ని క్రమబద్ధీకరించాలని సూచించారు. అన్ని వెంటిలేటర్లను అందుబాటులోకి తేవాలని చెప్పారు. అన్ని రకాల ఔషధాలు, పరికరాల గురించి టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ సమాచారం అందించాలని ఆదేశించారు. ఆర్టీపీసీఆర్ కిట్లు, ఇతర పరికరాలను వెంటనే కొనుగోలు చేసి, పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఆర్టీపీసీఆర్‌లో పాజిటివ్ వచ్చిన నమూనాలను గాంధీ దవాఖానలోని జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌కు పంపాలని తెలిపారు. రోజువారీ కేసుల వివరాలను సాయంత్రం 4 గంటలకు ప్రజలకు తెలియజేయాలని వెల్లడించారు. గత నాలుగేండ్లలో సీఎస్ఆర్ కింద చేపట్టిన పనుల నివేదికలను తయారు చేసి, అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా జడ్ చొంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, డీపీహెచ్ రవీందర్‌నాయక్, డీఎంఈ త్రివేణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ రాజారావు, ఉస్మానియా సూపరింటెండెంట్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ కడితే రేషన్ కట్!

మొదటిపేజీ తరువాయి...

దరఖాస్తు సమయంలోనే ఆ వ్యక్తికి, అతడి కుటుంబానికి సంబంధించిన వివరాలన్నీ తెలిసేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందులో నిబంధనలకు మించి ఆస్తులు, భూములు, ఐటీ చెల్లింపు వంటివి ఉంటే వెంటనే ఆ దరఖాస్తును తిరస్కరించేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే గతంలో అందరి నుంచి దరఖాస్తులు తీసుకునేవారు. ఆ తర్వాత వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఐటీ శాఖ ఆధ్వర్యంలో 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తో వడపోసే వారు. ఇందులో మిగిలిన వారికి రేషన్ కార్డులను జారీ చేసేవారు. ఇప్పుడు మాత్రం ఆదిలోనే దరఖాస్తులను స్క్రూటినీ చేసేలా చర్యలు చేపట్టినట్టు తెలిసింది. భూ పరిమితిని 3.5 ఎకరాలుగా నిర్ణయించినట్టు సమాచారం. కొత్త దరఖాస్తులను రైతుబంధు వివరాలతో సరిపోల్చే అంశంపైనా అధికారులు ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులకు సంబంధించి ఈ నెల 27వ తేదీన నిబంధనలతోపాటు మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్టు సమాచారం.

ప్రస్తుతం రాష్ట్రంలో 90.40 లక్షల రేషన్ కార్డులుండగా, ఇందులో 2.86 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. కొత్తగా సుమారు 10 లక్షల వరకు దరఖాస్తులు ఉన్నట్టు తెలిసింది. ఇప్పుడు వీటితోపాటు కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నది.





प्रगत संगणन विकास केन्द्र
సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్
सी डैक CDAC
ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ యొక్క సైంటిఫిక్ సొసైటీ, భారత ప్రభుత్వం

**ప్రవేశ ప్రకటన**

**PG డిప్లొమా కోర్సులు-మార్చి 2024 బ్యాచ్**

- PG డిప్లొమా ఇన్ బిగ్ డేటా అనలిటిక్స్ (PG-DBDA)
- PG డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (PG-DASSD)
- PG డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (PG-DAC)
- PG డిప్లొమా ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ (PG-DESD)
- PG డిప్లొమా ఇన్ VLSI డిజైన్ (PG-DVLSI)
- PG డిప్లొమా ఇన్ IT ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ & సెక్యూరిటీ (PG-DITISS)
- PG డిప్లొమా ఇన్ అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్ (PG-DUASP)

C-DAC's R&D నిపుణులు శిక్షణనిస్తారు
అత్యుత్తమ ప్లేస్‌మెంట్ రికార్డులు

- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల కొరకు ఆఖరి తేది: 3 జనవరి 2024
- C-CAT: 13 జనవరి 2024 మరియు 14 జనవరి 2024
- కోర్సు ప్రారంభం: 5 మార్చి 2024

మరింత సమాచారానికి QR కోడ్ స్కాన్ చేయండి

రిజిస్ట్రేషన్ కొరకు దర్శించండి: acts.cdac.in (లేదా) www.cdac.in

ప్లాట్ నం. 6&7, హార్డ్‌వేర్ పార్క్, సర్వే నం.1/1, శ్రీశైలం హైవే, పహాడీ షరీఫ్ వయా (కేశవగిరి పోస్ట్), హైదరాబాద్-501510
మరిన్ని వివరాలకు: ఫోన్: 040-29564857 లేదా 7382053731/32 ఇ-మెయిల్: training-hyd@cdac.in

CBC-06110/12/0002/2324